ప్రతి ఆటకి కొన్ని నియమాలు ఉంటాయి. ఆడే పద్ధతి కూడా వేరుగా ఉంటుంది. ఏదైనా ఆటే కదా అని ఎలాపడితే అలా ఆడితే ఓడిపోతారు. ఆప్టిట్యూడ్ టెస్ట్ కూడా అంతే. మ్యాథ్స్, రీజనింగ్‌లేగా.. అన్నీ మనకు తెలిసినవే అనుకుని తేలిగ్గా తీసుకుంటే దెబ్బతింటారు. ఆ టెస్ట్‌లు పెట్టడంలో కార్పొరేట్ సంస్థలకు ఎన్నో కాలిక్యులేషన్స్ ఉంటాయి. సహజంగా అభ్యర్థిలో ఉన్న సామర్థ్యాన్ని ఈ పరీక్షల ద్వారా పసిగట్టేస్తాయి.



ఆప్టిట్యూడ్ టెస్ట్ మెలకువలు

# సహజ సామర్థ్యమే సక్సెస్ సూత్రం!

ఎవరైనా యువకుడు ఫార్మల్‌గా దుస్తులు వేసుకుని, టక్ చేసి, నీట్‌గా షేవ్ చేసుకుని, చేతిలో ఫైల్ పట్టుకుని కనిపిస్తే.. 'ఏం బాబూ.. ఇంటర్వ్యూకా?' అని అడుగుతారు. జాబ్ తెచ్చుకోవడానికి ఇంటర్వ్యూకు హాజరవ్వాలని లోకం మొత్తానికి తెలుసు. కానీ ఉద్యోగం కోసం ప్రయత్నించేవారికి మాత్రమే తెలుసు.. జాబ్ అంటే ఇంటర్వ్యూ మాత్రమే కాదని! ఇంటర్వ్యూ వరకు వెళ్లాలంటే దానికి ముందు రాతపరీక్ష పాస్ అవ్వాల్సి ఉంటుందని. అదే.. ఆప్టిట్యూడ్ టెస్ట్. అది ప్రైవేటు ఉద్యోగమైనా, ప్రభుత్వ ఉద్యోగమైనా ముందు ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించి అందులో పాస్ అయినవాళ్లనే ఇంటర్వ్యూకు పిలుస్తారు.

ఇప్పటికీ మనలో చాలామంది ఆప్టిట్యూడ్ అంటే మేథ్స్ అనీ, 8, 9 తరగతుల్లో అడిగిన ప్రశ్నలనే అడుగుతారని అనుకుంటాం. కానీ ఇక్కడ మొదట అర్థం చేసుకోవాల్సిన విషయం.. 'ఆప్టిట్యూడ్ అంటే మేథమేటిక్స్ కాదు'. సంస్థకు మీ గణిత నైపుణ్యాలతో పనిలేదు. అలా ఉండుంటే పది, ఇంటర్‌లో మేథ్స్‌లో వచ్చిన మార్కులతోనే ఎంపిక లేదా రిజెక్ట్ చేసేసేవారు. అలా జరగటం లేదు అంటే.. ఆ సంస్థ మీలో వేరే నైపుణ్యాలను అంచనా వేయాలనుకుంటోంది. ఏంటవి? అసలు ఆప్టిట్యూడ్ అంటే ఏమిటి? నేచురల్ ఎబిలిటీ.. సహజ సామర్థ్యం. ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఒక సంస్థ అభ్యర్థికి సమస్యలను పరిష్కరించే సహజ సామర్థ్యం ఉందో లేదో తెలుసుకోవాలనుకుంటుంది. అందుకే మేథ్స్‌లో ఉండే ప్రాబ్లమ్స్ సాయం తీసుకుంటుంది కానీ వాటిని సాల్వ్ చేయడానికి ఎక్కువ సమయం ఇవ్వదు. అంటే మన ఆలోచనా విధానం సహజంగా ఉండాలనేది ఈ పరీక్ష ఉద్దేశం.



వంశీకృష్ణారెడ్డి, సీఈఓ, క్రియేట్ యూ

## కాలం-పనిలో ఓ సమస్య

A alone can complete the work in 20 days, B alone can complete it in 30 days. If A, B & C work together, then work will be completed in 7 days. If total wages of Rs.6000 is paid for the work, find the share of C?

ఇది మేథమేటిక్స్‌లా కాకుండా 'పనికి విలువుంటుంది, మనిషికి కాదు' అన్న భావనతో ఆలోచిద్దాం. ఇక్కడ పని విలువ రూ. 6000. ఎవరు చేసినా, ఎంత మంది చేసినా, ఎన్ని రోజులు చేసినా ఆ పని విలువ మారదు. A ఒక్కడే చేస్తే A ఒక్కడికే రూ.6000 వస్తాయి. కానీ 20 రోజులు పని చేస్తేనే! 20 రోజులకు రూ. 6000 అంటే రోజుకు 300. ఈ ప్రాబ్లమ్‌లో A పనిచేసింది 7 రోజులు అంటే అతని షేర్ 300 x 7 = రూ.2100. B ఒక్కడే చేస్తే 30 రోజులకు రూ.6000 అంటే రోజుకి 200 అంటే 7 రోజులకు రూ. 1400. B షేర్ రూ.1400. మొత్తం రూ. 6000లో రూ. 2100 + రూ. 1400 = రూ.3500 తీసేస్తే మిగిలిన రూ. 2500 C షేర్ అవుతుంది.

ఇలా ఆప్టిట్యూడ్‌లో అడిగే ప్రతి ప్రశ్నా మనం రోజూ వాడే కాన్సెప్టుల్లోనే ఉంటుంది. కొన్నిసార్లు ఆప్షన్లతో తికమక పెడుతుంటారు.

ఉదాహరణకు- A's salary has increased by 20% and then decreased by 20%. What is the overall effect on his salary?

1) No effect 2) 4% decrease 3) 4% increase 4) 2% decrease 5) 2% increase

ఇది చూడగానే మనకు ఆప్షన్ 1 సమాధానం అనిపిస్తుంది. కానీ ఆలోచిస్తే తెలియని జీతాన్ని X అనుకోవడం అలవాటు మనకు. అలా కాకుండా మన జీతం 100% అనుకుందాం. అప్పుడు శాలరీ 20% పెరిగితే 120% అవుతుంది. ఇప్పుడు 20% తగ్గుతుంది. కానీ 120 నుంచి 20% తగ్గుతుంది అంటే 20% of 120= 24 తగ్గుతుంది. అంటే 120-24= 96% అవుతుంది. 100% నుంచి 96% అయ్యింది అంటే 4% తగ్గుతుంది అని అర్థం. కాబట్టి మన సమాధానం ఆప్షన్-2 అవుతుంది.



## రెండు ఉపయోగాలు

ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించడం వల్ల సంస్థకు రెండు ప్రయోజనాలుంటాయి. మొదటిది అందరికీ ఇంటర్వ్యూ నిర్వహించడం చాలా కష్టం. పైగా అందుకు చాలా సమయం వృథా అవుతుంది. కాబట్టి అందరికీ ఆ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇది సెలక్షన్ టెస్ట్ కాదు.. ఎలిమినేషన్ టెస్ట్. అందుకే ఈ రౌండ్‌ను 'మాస్ ఎలిమినేషన్ రౌండ్' అని కూడా అంటారు. ఇక రెండో ప్రయోజనం.. చాలా ముఖ్యమైంది. ఊరికే ఏదో పరీక్ష ఉండాలని ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను పెట్టరు. ఎంతోమంది ఎంతో ఆలోచించి ఈ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు. కంపెనీ ఈ టెస్ట్‌ను కూడా ఒక ఇంటర్వ్యూలాగానే భావిస్తుంది. అందుకే ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను 'రిటెన్ ఇంటర్వ్యూ' అని కూడా అంటుంటారు.

క్రికెట్‌లో బ్యాట్ ఉంటుంది, బాల్ ఉంటుంది. ప్రతీ టీంలో పదకొండు మంది ఆటగాళ్లు ఉంటారు. హాకీలో కూడా బ్యాట్, బాల్, పదకొండు మందే ఉంటారు. కానీ రెండు ఆటలకూ పోలికే ఉండదు. ఆడే నైపుణ్యాలు, పద్ధతులు, నియమాలు అన్నీ వేరే. ఆప్టిట్యూడ్, మేథమేటిక్స్ కూడా అలాంటివే! రెండిట్లో కాలిక్యులేషన్స్ ఉంటాయి కానీ సాల్వ్ చేసే విధానాలు, ఆలోచించే పద్ధతులు పూర్తిగా వేరు.

## లాజికల్ ఆప్టిట్యూడ్

రక్త సంబంధాల్లో మేనల్లుడిని నెవ్యూ అనీ, మేనకోడల్ని నీస్ అనీ అనుకుంటాం. మన తోబుట్టువుల పిల్లలను కూడా అలానే పిలుస్తాం. అంటే వరుసకు మనకు కొడుకు (మేనల్లుడు కాకపోయినా) అయినా నెవ్యూ అనే అంటాం. ఇలాంటి చిన్న చిన్న విషయాలు కచ్చితంగా తెలుసుకోవాలి.

గడియారాలు అయితే 3, 4 గంటలకు మధ్యలో ఏ సమయానికి రెండు ముల్లులు కలుస్తాయని అడుగుతారు. మనం వెంటనే 3:15 గంటలకు అనేస్తాం. కానీ ఆలోచిస్తే అర్థమవుతుంది 3:15 కాదని! ఎందుకంటే సరిగ్గా 3కి చిన్నముల్లు 3 మీదుంటుంది. 3:15కి పెద్దముల్లు 3 మీదుంటుంది. కానీ చిన్నముల్లు 3కి కొంచెం కింద ఉంటుంది. అందుకే సమాధానం 3:16 4/11 అవుతుంది.

ఇలా ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఎగ్జామినర్ తికమక పెట్టడానికి ఎంతో ప్రయత్నిస్తుంటారు. తప్పు సమాధానాన్ని మార్క్ చేస్తే ఎగ్జామినర్ గెలిచినట్టు. సరైన సమాధానాన్ని గుర్తించినా, దాన్ని వదిలేసినా మనం గెలిచినట్టు. ఎందుకంటే అడిగిన అన్ని ప్రశ్నలనూ పూర్తిచేయడం ఎవరివల్లా కాదు. అందుకే అందులో సులువైనవాటిని ఎంచుకుని కష్టమైనవి వదిలేస్తూ ఎంతో జాగ్రత్తగా పరీక్షకు ప్రణాళిక వేసుకోవాలి.

## కష్టమేమీ కాదు

ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను క్రికెట్‌తో పోలిస్తే ఎగ్జామినర్ బౌలర్ లాంటివాడు. ఎన్నో రకాల బంతులు వేస్తూ ఉంటాడు. ఎన్నో వేరియేషన్స్‌ను ప్రయత్నిస్తుంటాడు. అప్పుడప్పుడు బాల్‌ను ఫ్లైట్ చేస్తాడు. సిక్స్ కొట్టేలా ప్రేరేపిస్తాడు. కానీ మనం టెంప్ట్ అయితే అవుట్ అయ్యే అవకాశం ఎక్కువ. అందుకే మన బలాలేవో తెలుసుకుని రాహుల్ ద్రవిడ్‌లా ఎంతో సంయమనంతో ఆడాలి. కష్టమైన బంతులను వదిలేస్తూ సులభమైనవాటిని బౌండరీకి తరలిస్తూ ఓపికగా ఆడాలి. అందరూ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు తక్కువ సమయాన్ని ఇస్తారు కాబట్టి త్వరత్వరగా జవాబులు గుర్తించాలనుకుంటూ హడావుడిలో తప్పులు ఎక్కువ చేస్తుంటారు. టీ20 మ్యాచ్‌లా ఆడతారు. కానీ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను జాగ్రత్తగా ఆలోచించి టెస్ట్ క్రికెట్‌లా ఆడాలి.

ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా అభ్యర్థిలో సమయస్ఫూర్తి, నిర్ణయం తీసుకునే నైపుణ్యం, సహనం, శ్రద్ధ, కాల్క్యులేషన్స్‌ను ఎంత త్వరగా చేయగలుగుతున్నారనేది పరీక్షిస్తారు. కాబట్టి సాధన చేసేటప్పుడే ఎంత సహజంగా ఆలోచించి సమాధానాలను చేస్తున్నారనేది ముఖ్యం. ఇంట్లో అమ్మకో, నాన్నకో సమస్య వస్తే ఎలా సలహాలు ఇస్తారో, ఎలా ఆలోచిస్తారో సరిగ్గా అలాగే పరీక్షలోనూ ఆలోచించాలి. ఇంట్లో సమస్యకు ఎలా పెన్నూ, పేపరూ వాడరో పరీక్షలోని సమస్యలకూ వీలైనంతవరకు అవి వాడకుండానే పరిష్కరించేలా సన్నద్ధమవ్వాలి.

ఒక రచయిత అన్నట్లు.. Attitude decides your bravery.. but Aptitude decides your salary.

## ఎలా ఆలోచించాలి?

ఆప్టిట్యూడ్ రెండు రకాలు 1. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 2. లాజికల్ ఆప్టిట్యూడ్ (లాజికల్ రీజనింగ్). క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో సరాసరి, శాతాలు, లాభనష్టాలు, వయసు, అలగేషన్స్ అండ్ మిక్చర్స్, భాగస్వామ్యం, పని-కాలం, పని-దూరం, వడ్డీలు, పర్మ్యూటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ ఉంటాయి. లాజికల్ ఆప్టిట్యూడ్‌లో.. రక్తసంబంధాలు, గడియారాలు, క్యాలెండర్, డైరెక్షన్స్, కోడింగ్-డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, లాజికల్ పజిల్స్ ఉంటాయి.

ఒకసారి సిలబస్ మొత్తాన్ని జాగ్రత్తగా గమనిస్తే అందులో ఉన్న ప్రతి అంశమూ మన నిత్యజీవితంతో సంబంధమున్నదే అని అర్థమవుతుంది.

ఉదాహరణకు- వయసుకు సంబంధించి ఇలా ప్రశ్నను అడిగామనుకుందాం!

Father's present age is 24 years more than his son. After two years, father's age will be double the age of his son. Find the present age of son?

దీన్ని మేథమేటిక్స్‌లో చేయాలనుకుంటే తండ్రి వయసు X అనుకుని, కొడుకు వయసు Y అనుకుని

$X = Y + 24$ ని ఈక్వేషన్ (1) అనుకుని

$X + 2 = 2(Y+2)$ ఈక్వేషన్ (2) అనుకుని

X స్థానంలో Y+ 24 ను ప్రతిక్షేపించి, లెక్కిస్తే అప్పుడు Y = 22 సంవత్సరాలు అని వస్తుంది.

అదే ఆప్టిట్యూడ్‌లో అంటే సహజంగా ఆలోచిస్తే పది సెకన్లలో సమాధానం వస్తుంది.

తండ్రి ప్రస్తుత వయసు కొడుకు కంటే 24 ఏళ్లు ఎక్కువ. అంటే తండ్రి జీవితాంతం కొడుకు కంటే 24 సంవత్సరాలు ఎక్కువే ఉంటాడు. కొడుకు పుట్టినపుడు తండ్రికి 24 అనుకుందాం. కొడుకుకు 1 అయితే తండ్రికి 25. వ్యత్యాసం 24. కొడుకు 2 అయినప్పుడే తండ్రికి 26. మళ్లీ వ్యత్యాసం 24. అంటే తండ్రీకొడుకుల మధ్య వయసు వ్యత్యాసం ఎప్పటికీ మారదన్నమాట. ఇది పాయింట్-1.

వ్యత్యాసం 24 ఉన్నప్పుడు తండ్రి వయసు కొడుకుకి రెట్టింపు కావాలంటే అది కొడుకుకు 24 ఏళ్లు వచ్చినపుడు మాత్రమే అవుతుంది. అప్పుడు కొడుకు 24, తండ్రి 48 అవుతారు.

ఈ సమస్యలో తండ్రి వయసు కొడుకుకు రెట్టింపు 2 సంవత్సరాల తరువాత అయ్యిందట! అంటే రెండేళ్ల తరువాత కొడుకుకు 24 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి ఇప్పుడు కొడుకుకు 22 సంవత్సరాలు అయిపోయింది. అంతే!

సులువుగా చెప్పాలంటే వయసులో వ్యత్యాసం 24. కొడుకుకు రెండేళ్ల తరువాత 24 ఏళ్లు. అంటే ఇప్పుడు 22 సంవత్సరాలు.

అదే ప్రశ్నలో తండ్రి-కొడుకు మధ్య తేడా 30 ఉండి, 5 సంవత్సరాల తరువాత తండ్రిది రెట్టింపు అయ్యుంటే సమాధానం కొడుకు ప్రస్తుత వయసు 25 అయ్యుండేది.

## ఫీల్డ్ మార్కెటింగ్‌లో!

తాజా ఇంటర్న్‌షిప్స్

**ఆపరేషన్స్**
సంస్థ: Stealth Mode (IoT Startup)
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.2500
లింకు: internshala.com/i/9179
గడువు: ఫిబ్రవరి 28, 2018
అర్హులు: ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ పవర్‌పాయింట్

**సోషల్ మీడియా మార్కెటింగ్**
సంస్థ: Franchise Alpha
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/9181
గడువు: ఫిబ్రవరి 28, 2018
అర్హులు: సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు ఉన్నవారు.



**ఫీల్డ్ మార్కెటింగ్**
సంస్థ: WhizJuniors
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/9183
గడువు: ఫిబ్రవరి 27, 2018
అర్హులు: ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

**మార్కెటింగ్**
సంస్థ: CupShup ప్రదేశం:హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.2500-రూ.5000
లింకు: internshala.com/i/9185
గడువు: ఫిబ్రవరి 27, 2018
అర్హులు:ఎంఎస్‌ఆఫీస్ నైపుణ్యాలు ఉన్నవారు.

**హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)**
సంస్థ: VAM TECHSOL
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ.6000 లింకు: internshala.com/i/9186
గడువు: ఫిబ్రవరి 28, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు www.eenadupratibha.net చూడవచ్చు.

# పరిశోధనలో ఐఐఎస్సీ ప్రత్యేక సైన్స్ డిగ్రీ

సైన్స్ రంగం రోజు రోజుకీ అభివృద్ధి చెందుతోంది. కొత్త కొత్త ఆవిష్కరణలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐఐఎస్సీ నాలుగు సంవత్సరాల ప్రత్యేక సైన్స్ డిగ్రీని డిజైన్ చేసి అందిస్తోంది. పరస్పరాధారిత సైన్స్ సబ్జెక్టులు ప్రధానంగా ఇంజినీరింగ్, హ్యుమానిటీస్ అంశాలను మేళవించి ప్రస్తుత అవసరాలకు తగిన కోర్సును రూపొందించింది. పరిశోధన వృత్తిగా ఎంచుకోవాలనుకునే అభ్యర్థులకు ఇది చక్కటి మార్గం.

పరిశోధనలంటే ఆసక్తి ఉండి, డిగ్రీ నుంచే ఆ దిశగా మీరు అడుగులు వేయాలనుకుంటే.. మీకు ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఆహ్వానం పలుకుతోంది. ఈ సంస్థ నాలుగేళ్ల వ్యవధితో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (రిసెర్చ్) కోర్సులు నిర్వహిస్తోంది. కోర్సులో చేరినవాళ్లు ఏదైనా సైన్స్ సబ్జెక్టును ప్రత్యేకంగా చదవాల్సి ఉంటుంది. అయితే చదువుతున్న కోర్సుకే పరిమితం కాకుండా ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్ అంశాల్లోనూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. కోర్సులో చేరిన విద్యార్థులంతా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, ఇంజినీరింగ్, హ్యుమానిటీస్ అంశాలు చదవడం తప్పనిసరి. నాలుగేళ్లలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో మొదటి మూడు సెమిస్టర్లు అందరికీ ఉమ్మడిగా ఉంటాయి. అభ్యర్థులు తీసుకున్న స్పెషలైజేషన్‌ను తర్వాత మూడు సెమిస్టర్లలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తారు. నాలుగో ఏట పరిశోధన దిశగా ఫ్యాకల్టీల పర్యవేక్షణలో ప్రాజెక్టు చేస్తారు. అత్యంత నిష్ణాతులైన బోధకులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వసతులు...ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఐఐఎస్సీ సొంతం. విద్యార్థులు తమకు నచ్చిన అంశాల్లో పూర్తి స్వేచ్ఛతో పరిశోధనలు చేసుకోవచ్చు. నాలుగేళ్ల తర్వాత కావాలనుకుంటే ఐఐఎస్సీలోనే మరో ఏడాది చదివి పీజీ పట్టా అందుకోవచ్చు. అనంతరం పీహెచ్‌డీ దిశగా అడుగులేయవచ్చు.

## స్పెషలైజేషన్లు

కోర్సులో చేరినవాళ్లు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, మెటీరియల్స్, ఎర్త్ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్స్‌ల్లో ఏ సబ్జెక్టునైనా స్పెషలైజేషన్‌గా తీసుకోవచ్చు.



అలాగే స్పెషలైజేషన్, కోర్సుల కాంబినేషన్‌లను అభ్యర్థి ఆసక్తి ప్రకారం ఎంచుకోవచ్చు. అయితే వారి అభిరుచితోపాటు మొదటి మూడు సెమిస్టర్లలో చూపిన ప్రతిభ ప్రకారం స్పెషలైజేషన్‌ను కేటాయిస్తారు. నాలుగు కోర్సులను మేజర్, మైనర్ డిసిప్లిన్లుగా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇంజినీరింగ్ నుంచి ఒక ఎలెక్టివ్ కోర్సు, హ్యుమానిటీస్‌లో ఒక సెమినార్ కోర్సు తీసుకోవడం తప్పనిసరి. కోర్సు పూర్తయిన తర్వాత అభ్యర్థులు తీసుకున్న మేజర్ డిసిప్లిన్ పేరుతో డిగ్రీలను ప్రదానం చేస్తారు. కోర్సులోకి మొత్తం 120 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఎంపికైనవారికి ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తక్కువ ధరకు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తారు. ట్యూషన్ ఫీజు కూడా సమంజసంగా ఉంటుంది.

**అర్హత:** ఎంపీసీ గ్రూప్‌తో 2017లో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు, 2018లో ద్వితీయ సంవత్సరం కోర్సు చదువుతున్నవారు అర్హులు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ తోపాటు బయాలజీ, ఎలక్ట్రానిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చదువుతున్నవాళ్లకీ అర్హత ఉంది. ప్రథమశ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీలు పాసై ఉంటే సరిపోతుంది.

## ప్రవేశం ఇలా

ఈ కోర్సులో ప్రవేశానికి ప్రత్యేకంగా పరీక్షలేమీ నిర్వహించరు. కేవీపీవై, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్‌లలో ఎందులోనైనా చూపిన ప్రతిభ ద్వారా సీట్లు కేటాయిస్తారు. సంబంధిత స్కోర్‌తో ఐఐఎస్సీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఫలితాలు వెలువడని వాళ్లు హాల్‌టికెట్ నెంబరు వివరాలు ఇస్తే సరిపోతుంది. జేఈఈ మెయిన్ లేదా అడ్వాన్స్‌డ్‌లో జనరల్ అభ్యర్థులైతే 60 శాతం, ఓబీసీలైతే 54 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 30 శాతం మార్కులు సాధించాలి.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 30

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.250.

**కౌన్సెలింగ్:** జూన్ మూడోవారం నుంచి మొదలవుతుంది.

**వెబ్‌సైట్:** www.iisc.ac.in/ug

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీంలో ఎంటీఎస్**

అహ్మదాబాద్, ముంబయి, నాగ్‌పూర్, పుణెలోని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీంలో ఎంటీఎస్ పోస్టులు. **పోస్టు–ఖాళీలు:** ఎంటీఎస్ (మెడికల్ అటెండెంట్/ లేడీ మెడికల్ అటెండెంట్)- 128. **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత, ప్రథమ చికిత్సలో సర్టిఫికెట్. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ప్రకటన తేది:** 16.02.2018. **చివరితేది:** ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజులు.
**వెబ్‌సైట్:** https://cghsrecruitment.mahaonline.gov.in/

**అరబిందో కాలేజీలో నాన్ టీచింగ్ పోస్టులు**

దిల్లీ యూనివర్సిటీకి చెందిన అరబిందో కాలేజీలో నాన్ టీచింగ్ పోస్టులు.
**పోస్టు–ఖాళీలు:** లైబ్రేరియన్- 1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్- 1, సీనియర్ అసిస్టెంట్- 1, ప్రొఫెషనల్ అసిస్టెంట్- 2, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ - 1, సెమీ ప్రొఫెషనల్ అసిస్టెంట్- 1, అసిస్టెంట్ - 2, ఎంటీఎస్- 16.
**దరఖాస్తు:** ఆన్‌లైన్. **ప్రకటన తేది:** 15.02.2018.
**చివరితేది:** ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజులు. **వెబ్‌సైట్:** www.du.ac.in/du

### వాక్ ఇన్స్

**టాటా మెమోరియల్ హాస్పిటల్**

ముంబయిలోని టాటా మెమోరియల్ హాస్పిటల్‌లో కింది విభాగాల్లో అడ్‌హక్ జూనియర్ ఇంజినీర్ పోస్టులు. **విభాగం–పోస్టులు:** సివిల్- 02, ఎలక్ట్రికల్- 01, మెకానికల్- 01. **అర్హత:** ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు అయిదేళ్ల పని అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
**వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 26.02.2018. **వేదిక:** హోమీ బాబా బ్లాక్, టాటా మెమోరియల్ హాస్పిటల్, ముంబయి.
**వెబ్‌సైట్:** http://tmc.gov.in/

**నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కటక్**

నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు.
**పోస్టు– ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అసిస్టెంట్- 02, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆపరేటర్- 06. **అర్హతలు:** పదోతరగతి, ఐటీఐ, బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో పని అనుభవం. **వయసు:** 18 నుంచి 45 సంవత్సరాల మధ్య. **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 5, 6 **వేదిక:** ఎన్‌ఆర్‌ఆర్‌ఐ, కటక్. **వెబ్‌సైట్:** www.crri.nic.in

### ప్రవేశాలు

**ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో పీహెచ్‌డీ ప్రోగ్రాం**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ తిరుపతిలో పీహెచ్‌డీ ప్రోగ్రాం ప్రవేశాలు.
**విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
**అర్హత:** సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ, నెట్/ జెస్ట్/ గేట్/ జీప్యాట్ అర్హత.
**వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరితేది:** 30.04.2018
**వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**